# రష్యా కంపెనీతో స్పేస్‌నెట్ ఒప్పందం

## ఎల్ఎన్‌జీ ప్రాజెక్టుల నిర్వహణకు సంయుక్త సంస్థ ఏర్పాటు

ఈనాడు, హైదరాబాద్: హైదరాబాద్ కేంద్రంగా కార్యకలాపాలు సాగిస్తూ, ఎన్ఎస్ఈలో నమోదైన కంపెనీ స్పేస్‌నెట్ ఎంటర్‌ప్రైజెస్ ఇండియా, రష్యాకు చెందిన మోడరన్ ఫ్యూయల్ టెక్నాలజీస్‌తో కలిసి మనదేశంలో ఎల్ఎన్‌జీ (లిక్విఫైడ్ న్యాచురల్ గ్యాస్) ప్రాజెక్టులు చేపట్టనుంది. దీని కోసం ఒక సంయుక్త సంస్థను ఏర్పాటు చేస్తారు. ఈ సంయుక్త సంస్థలో స్పేస్‌నెట్‌కు 25% వాటా ఉంటుంది. మొదటి దశలో మనదేశంలో 20 ఎల్ఎన్‌జీ గ్యాస్ స్టేషన్లు/ ఇంధన విక్రయ కేంద్రాలు ఏర్పాటు చేయాలనేది ప్రణాళిక. ఎల్ఎన్‌జీ గ్యాస్ స్టేషన్ల సంఖ్యను రెండో దశలో 180కి పెంచుతారు. భారీ వాణిజ్య వాహనాలకు ఎల్ఎన్‌జీ 'రెట్రోఫిట్టింగ్' కార్యకలాపాలనూ చేపడతారు. మనదేశంలో ఈ సంయుక్త సంస్థ చేపట్టే ప్రాజెక్టులకు రష్యా బ్యాంకు నుంచి రుణసదుపాయం లభిస్తుందని స్పేస్‌నెట్ వెల్లడించింది. సత్వర అభివృద్ధి సాధిస్తున్న మనదేశంలో వచ్చే 10-15 ఏళ్ల పాటు ఇంధన గిరాకీ గణనీయంగా పెరుగుతుందని అంచనా. అదే సమయంలో 'క్లీన్ ఎనర్జీ'కి ప్రాధాన్యం అధికమవుతోంది. ఎల్ఎన్‌జీ లభ్యత పెంపొందించేందుకు, తాము చేపట్టే ప్రాజెక్టులు దోహదపడతాయని స్పేస్‌నెట్ ఎంటర్‌ప్రైజెస్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ప్రకాష్ దసిగి, మోడరన్ గ్యాస్ జనరల్ డైరెక్టర్ అలెగ్జాండర్ సోరోకిన్ వివరించారు. బొగ్గు, పెట్రోలియంతో పోల్చితే సహజ వాయువు వినియోగం ద్వారా కాలుష్యాన్ని 30-40% తగ్గించొచ్చని పేర్కొన్నారు. తక్కువ కార్బన్ గల హైడ్రోజన్ ఉత్పత్తికి ఎల్ఎన్‌జీ వీలుకల్పిస్తుందని అన్నారు. 2022లో 20.79 మిలియన్ టన్నుల ఎల్ఎన్‌జీని మనదేశం దిగుమతి చేసుకుంది. భవిష్యత్తులో ఎల్ఎన్‌జీ దిగుమతులు ఇంకా పెరుగుతాయని అంచనా వేస్తున్నారు.

Eenadu 01-08-2024 Pg 18

# మోడర్న్ ఫ్యూయల్‌తో స్పేస్‌నెట్ జోడీ

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: ఫిన్‌టెక్ కంపెనీ స్పేస్‌నెట్ ఎంటర్‌ప్రైసెస్, రష్యాకు చెందిన మోడర్న్ ఫ్యూయల్ టెక్నాలజీస్ భాగస్వామ్య కంపెనీ ఏర్పాటు చేశాయి. లిక్విఫైడ్ నేచురల్ గ్యాస్ (ఎల్ఎన్‌జీ) ప్రాజెక్టులను ఈ జేవీ దేశవ్యాప్తంగా చేపట్టనుంది. 2027 మార్చి నాటికి 20 ఎల్ఎన్‌జీ గ్యాస్ స్టేషన్స్, ఫ్యూయల్ రిటైల్ ఔట్‌లెట్లను స్థాపించనుంది. రెట్రోఫిటింగ్ విధానాన్ని ప్రోత్సహించడం ద్వారా భారీ వాణిజ్య వాహనాలను ఎల్ఎన్‌జీ వైపు మళ్లేలా చేయనున్నట్టు ఇరు కంపెనీలు తెలిపాయి. జేవీలో స్పేస్‌నెట్‌కు 15–25 శాతం వాటా ఉంటుంది.

Sakshi 02-08-2024 Pg 01

# రష్యా కంపెనీతో స్పేస్‌నెట్ జాయింట్ వెంచర్

**హైదరాబాద్:** హైదరాబాద్‌కు చెందిన స్పేస్‌నెట్ ఎంటర్‌ప్రైజెస్ ఇండియా లిమిటెడ్, రష్యాకు కంపెనీ మోడర్న్ ఫ్యూయెల్ టెక్నాలజీస్ జాయింట్ వెంచర్‌ను ప్రకటించాయి. దేశవ్యాప్తంగా లిక్విఫైడ్ నేచురల్ గ్యాస్ (ఎల్ఎన్‌జి) ప్రాజెక్ట్ అములు కోసం జాయింట్ వెంచర్‌లోకి ప్రవేశించాయి. దీని ద్వారా మొదటి దశ 20 ఎల్ఎన్‌జి గ్యాస్ స్టేషన్లు, ఇంధన రిటైల్ అవుట్‌లెట్‌ల ఏర్పాటు, రెండో దశలో దేశవ్యాప్తంగా 180 ఎల్ఎన్‌జి గ్యాస్ స్టేషన్‌లు, ఇంధన రిటైల్ అవుట్‌లెట్‌లకు విస్తరణ చేపట్టనున్నారు. స్పేస్‌నెట్ ఎంటర్‌ప్రైజెస్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ప్రకాశ దాసిగి, మోడ్రన్ గ్యాస్ టెక్నాలజీస్ జనరల్ డైరెక్టర్ అలెగ్జాండర్ సోరోకిన్ ఈ వెంచర్‌పై ఆశావాదాన్ని వ్యక్తం చేశారు.

Mana Telangana 02-08-2024 Pg 13